ఈనెల 22 నుండి కేజీబీవీల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణ

కేజీబీవీ ప్రిన్సిపల్ గౌస్య బేగం

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో ఉన్నా కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ 6, నుంచి 11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి మార్చి 22 నుండి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయని అన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ, బి.పి. ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణింపబడతాయని తెలిపారు. ఈ దరఖాస్తు https://apkgbv.apcfss.in సైట్ ద్వారా పొందగలరు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు. ఏవైనా సమస్యలు, సందేహాలకు ఫోన్ నొమ్బెర్ 8008237261 సంప్రదించాలని కోరారు.

బోరుబావుల తవ్వకానికి భూమి పూజ

ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు

విశాలాంధ్ర -వేపాడ : మండలంలోని కృష్ణా రాయుడుపేట పంచాయతీలో తాగునీటి బోరుబావి తవ్వకానికి మండల పరిషత్ అధ్యక్షుడు దొగ్గ సత్యవంతుడు(సతీష్) చేతుల మీదుగా బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ మండల పరిషత్తు నిధులతో బోరు బావులు తవ్వకానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మండలంలోని నల్లబిల్లి పంచాయతీ పరిధిలో రెండు బోరుబావులు వేపాడ పంచాయతీ పరిధిలో రెండు బోరుబావులు కృష్ణా రాయుడుపేట పంచాయతీలో ఒక బోరు బావికి మండల పరిషత్ నిధులతో బోరు బావులు తవ్వించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు కృష్ణారెడ్డిపేట పంచాయతీలో బోరు బావికి భూమి పూజ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ రాయుడుపేట గ్రామ సర్పంచ్ చెలుబోని ముసలినాయుడు (బాల బాబు) మాజీ సర్పంచ్ అలబోని పైడిబాబు గ్రామ పెద్దలు బాజంకి శ్రీనివాసరావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాలవలస ఛానల్ కాలువ పనులను చైర్మన్ ప్రారంభం

విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండలంలో పాలవలస చేనల్ కాలువ పనులను కనిమెళ్ళ వద్ద ఛానెల్ చైర్మన్ రౌతు ఉపేంద్ర బుధవారం ప్రారంభించారు. ఎప్పటి నుంచో పట్టించుకోక కాలవలో మట్టి, డొంకలు, చెట్లు ఎక్కువగా పెరిగిపోవటం తో గత కొంత కాలం గా నీరు ప్రవహించే అందుకు తగిన మార్గం లేక వర్షాకాలంలో కాలవలో నీరు నడవక పక్కనే ఉన్న పొలాలు ముంపుకు గురి అయ్యాయి. దీనితో ప్రభుత్వం పూడిక, చెట్లు తొలగించటానికి సుమారుగా 15లక్షల రూపాయలతో టెండర్లు పిలిచి గుత్తేదారులు పని అప్పగించారు. గుత్తేదారు బుదవారం ఉదయం జేసీపీల సాయంలో పనులు ప్రారంభించారు. ఈ కాలువను 5కిలోమీటర్లు మేర చెత్తను, పెరిగి అడ్డుగా ఉన్న చెట్లు తొలగించి నీరు ప్రవహించే అందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్నట్లు ఇరిగేషన్ జే.ఈ విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రౌతు ఉపేంద్రతో పాటు, గుత్తేదారులు రామునాయుడు, ఇరిగేషన్ శాఖ సిబంది లంకలపల్లి శ్రీను, బంగారి రైతులు పాల్గొన్నారు.

10వ తరగతి పరీక్షా కేంద్రాలను ఎంపీడీఓ పరిశీలన

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రం వేపాడలో నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. ఈమేరకు వేపాడ జిల్లా పరిషత్ హై స్కూల్ పరీక్షా కేంద్రంను,అలాగే విక్టరీ హైస్కూల్లో నిర్వహించిన 10వ తరగతి పరీక్షల కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు మౌలిక వసతులు పరీక్షల కేంద్రాల దగ్గర త్రాగునీరు వైద్య సిబ్బంది వంటి వసతులు అందుబాటులో ఉన్నది లేనిది పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆర్టీసీలో ముగిసిన 20వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక ఆర్టిసి గ్యారేజ్ వద్ద బుధవారం ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో 20 వ బ్యాచ్ అభ్యర్థులకు హెవీ డ్రైవింగ్ శిక్షణతో ముగిసింది. జిల్లా డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ డి.మాణికుమార్ శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. భవిష్యత్తులో మంచి డ్రైవర్స్‌గా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. డ్రైవర్లకు డ్రైవింగ్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి సి. హెచ్. అప్పలనారాయణ డిపో మేనేజర్ శ్రీ.జే.శ్రీనివాసరావు సూపర్వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది డ్రైవింగ్ ఇన్స్పెక్టర్లు హాజరైనారు.

బొబ్బిలి వీణ తయారీ కేంద్రాలకు ప్రభుత్వం సహకారం అందించాలి : ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి : పౌరుషాలకు, త్యాగాలకు, ప్రతీకారాలకు పేరుగాంచిన బొబ్బిలిలో శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి వారు, దాడితల్లి అమ్మవారు, సరేపోలమ్మ అమ్మవారు ఉన్న ప్రాంతానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిందిబొబ్బిలి వీణ అని ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) అన్నారు.బొబ్బిలి వీణ చరిత్రను గురించి వివరిస్తూ, విజయనగరం సంస్థానంలో సహాయక వడ్రంగిగా పనిచేసిన ముసినాడ చిన్నయ్య నూజివీడు వెళ్లి వీణల తయారీని అభ్యసించారని, తరువాత, బంధుత్వ రీత్యా బొబ్బిలి వచ్చినప్పుడు బొబ్బిలి సంస్థానంలో ఆస్థాన వడ్రంగి అయిన రాయల వీరభద్రుడుకి ఈ కళను నేర్పించడం జరిగిందని తెలిపారు.. వీరభద్రుడు గారు మన ప్రాంతమైన బొబ్బిలికి వీణల ద్వారా మరింత పేరుప్రఖ్యాతలు తేవాలన్న సంకల్పంతో బొబ్బిలి సంస్థానం 11వ రాజా అయిన తమ ముత్తాత మహారాజా శ్రీ శ్వేతాచలపతి రంగారావు అనుమతితో వారి సోదరులైన సర్వసిద్ధి అప్పలస్వామి మరియు సర్వసిద్ధి సాంబన్నకి ఈ విద్యను నేర్పించడం జరిగిందని తెలిపారు.. తదుపరి తమ సంస్థానాదీసులు కూడా ఈ వీణల తయారీని ప్రోత్సహిస్తూ వస్తున్నామని, తమ తండ్రి ఆర్.వీ.జి.కే.రంగారావు తమ పాతకోటలోని ఒక గదిని ఈవీణల తయారీ కేంద్రానికి కేటాయించడం జరిగిందని చెప్పారు. 1994లో గొల్లపల్లి గ్రామానికి చెందిన సర్వసిద్ధి రమణ ముందుకువచ్చి షేర్ క్యాపిటల్ ద్వారా కొంత స్థలాన్ని సమకూర్చగా, మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహన రావు ప్రభుత్వ సహకారంతో ప్రస్తుతం ఉన్న వీణల కేంద్రాన్ని మంజూరు చేయించారని చెప్పారు. అయోధ్య రామాలయానికి ఒక బొబ్బిలి వీణను సమర్పించాలనే ఉద్దేశంతో బొబ్బిలి వీణల తయారీ కేంద్రాన్ని సందర్శించానని, అప్పుడు వారితో మాట్లాడగా వీణల తయారీ కోసం వాడే ముడిసరుకు అయిన పనసకర్ర కొరతను గురించి మరియు దాదాపు 10 సంవత్సరాలు క్రిందట ఇచ్చిన యంత్రాలు/పనిముట్లు మార్చవలసిన అవసరం ఉందని తనకు తెలిపారని అన్నారు. ఈవిషయమై గౌరవ మంత్రి గారుతో చర్చించగా, మన రాష్ట్ర అటవీ ప్రాంతంలో పనస చెట్లను పెంచే విధంగా చర్యలు చేపట్టి, వారిని ఆదుకునే ప్రయత్నం చేద్దామని గౌరవ మంత్రి గారు సూచించారని, అయితే ఒక చెట్టు పెరిగి ముడిసరుకుగా మారేందుకు దాదాపు 20-25 సంవత్సరాలు పడుతున్నందున, అంతవరకు పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళలో అందుబాటులో ఉన్న పనసకర్రను ప్రభుత్వం ఖరీదు చేసి వీణల తయారీ కేంద్రాలకు సరఫరా చేయాలని సూచించారు. తద్వారా, ఇటువంటి కళలు అంతరించిపోకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టి, తమ ప్రాంత కళాకారులను ఆదుకోవాలని కోరారు. మంత్రి ఎస్.సవితమ్మ సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం తరుపున బొబ్బిలి వీణల తయారీ కేంద్రాలను అన్నివిధాలుగా సహకారం అందిస్తామని తెలిపారు.

సైబరు నేరాలను చేధించేందుకు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సైబరు నేరాలను నియంత్రించేందుకు, ఆయా కేసుల్లో దర్యాప్తు చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్నిమెరుగుపర్చుకోవాలని వివిధ పోలీసు స్టేషన్లులో కంప్యూటరు ఆపరేటర్లగా పని చేస్తున్న కానిస్టేబుళ్ళుకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పిలుపునిచ్చారు. సైబరు నేరాల్లో దర్యాప్తు చేపట్టుటే లక్ష్యంగా కంప్యూటరు పరిజ్ఞానంను మరింత మెరుగుపర్చేందుకు పోలీసు కానిస్టేబుళ్ళుకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సైబరు నేరాలు, మోసాలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఈ తరహా నేరాలను నియంత్రించుట లేదా నమోదైన కేసుల్లో దర్యాప్తు చేపట్టుటకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతీ పోలీసు అధికారి మెరుగుపర్చుకోవాలన్నారు. ఎవరైతే సైబరు నేరాలను చేధించుటలో సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తారో తప్పనిసరిగా వారికి పోలీసుశాఖలో ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుందన్నారు. కావున, ప్రతీ పోలీసు ఉద్యోగి సైబరు నేరాలను చేధించుటలకు అవసరమైన పరిజ్ఞానాన్ని, సాంకేతికతను, నైపుణ్యాన్ని ప్రత్యేక శ్రద్ధతో మెరుగుపర్చుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకొంటే సాధారణ నేరాల్లో మాదిరిగానే సైబరు నేరాలను కూడా చేధించవచ్చున్నారు. సైబరు నేరం జరిగిన వెంటనే బాధితులు 1930కు ఫిర్యాదు చేసే విధంగా చూడాలన్నారు. ఫిర్యాదు అంశాలను ముందుగా పరిశీలించి, అది ఏతరహా నేరమో గుర్తించాలన్నారు. నేరం జరిగిన తీరును తెలుసుకొని, బాధితులను విచారణ చేసిన తరువాత, నేరంకు సంబంధించిన ఆధారాలను, డాక్యుమెంట్లును తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బాధితుడి బ్యాంకు స్టేటుమెంటును పరిశీలించి, నేరంకు పాల్పడిన మోసగాడి బ్యాంకు అకౌంటుకు నగదు ఏవిధంగా బదిలీ అయ్యింది, అక్కడ నుండి ఇంకేమైనా అకౌంట్సు నగదు బదిలీ జరిగిందా? లేదా? అన్న విషయాలను గుర్తించాలన్నారు. ఇలా గుర్తించిన బ్యాంకు లావాదేవీలను ఫ్రీజ్ చేసేందుకు సంబంధిత విభాగాలకు ఎటువంటి ఆలస్యం చేయకుండా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలన్నారు. అదే విధంగా మొబైల్స్ పోగొట్టుకున్నామని పోలీసు స్టేషనుకు వచ్చే ఫిర్యాదులపట్ల కూడా సానుకూలంగా వ్యవహరించాలన్నారు. వారు ఇచ్చే ఫిర్యాదులను గూగుల్ ఫారంలో పూర్తి చేసి, సైబర్ సెల్ కి పంపాలని వివిధ పోలీసు స్టేషన్లు నుండి వచ్చిన కంప్యూటరు ఆపరేటర్లను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సైబరు అండ్ సోషల్ మీడియా సెల్ సిఐ బి.శ్రీనివాసరావు, ఎస్పీ సిఐ ఎ.వి.లీలారావు, కంప్యూటరు నిపుణులు రామరాజు, కే.ప్రసాద్, జగదీష్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నశ్రీనుకి పుత్ర వియోగం

- చిన్న కుమారుడు మజ్జి ప్రణీత్‌కు కన్నీటి వీడ్కోలు
- ఫోన్ ద్వారా పరామర్శించిన మాజీ సీఎం జగన్‌మోహనరెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పరిషత్ చైర్పర్సన్, జిల్లా వైకాపా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు గారు ఇంట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఆయన చిన్న కుమారుడు ప్రణీత్ అనారోగ్యంతో బుధవారం ఉదయం విశాఖలో మరణించారు. ధర్మపురిలోని చిన్నశ్రీను స్వగృహానికి తీసుకువచ్చారు. తోటపాలెం స్మశాన వాటిల్లో అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, చిన్న శ్రీను అభిమానులు, అనుచర గణం పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన వివిధ పార్టీల నాయకులు, జడ్పిటిసిలు ఎంపీపీలు జిల్లా అధికారులు, కార్యకర్తలు చిన్న శ్రీను కుటుంబాన్ని పరామర్శించారు. అంత్యక్రియల్లో ఉత్తరాంధ్ర వైకాపా సమన్వయకర్త కురసాల కన్నబాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పార్వతీపురం మన్యం జిల్లా వైకాపా అధ్యక్షులు పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మాజీ శాసనసభ్యులు సంభంగి వెంకట చిన అప్పలనాయుడు, బొత్స అప్పల నరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, అలజంగి జోగారావు, కంబాల జోగులు,తలె రాజేష్, కరణం ధర్మశ్రీ, బొడ్డేటి ప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్ పరామర్శ : చిన్న శ్రీను కుమారుడు ప్రణీత్ మరణం పట్ల మాజీ సీఎం, వైకాపా జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన ఫోన్ ద్వారా చిన్న శ్రీనును పరామర్శించారు. కుమారుని మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఇలాంటి కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

బాల్య వివాహాలు, బాల కార్మికులు తగ్గాలి

డ్రాప్ అవుట్, కర్మాగారాల్లో పని చేస్తున్న బాలికలను గుర్తించాలి
సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : మిషన్ వాత్సల్య కార్యక్రమం క్రింద బాలల సంక్షేమం, పరిరక్షణ కోసం గ్రామ స్థాయిలో సర్పంచ్ ఆధ్వర్యం లో కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి 15 రోజులకు ఒక సారి సమావేశం నిర్వహించాలని సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. బుధవారం జిల్లా స్థాయి బాలల పరిరక్షణ కమిటీ జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి కమిటీలో మహిళా పోలీస్ కన్వీనర్‌గా ఉంటారని, పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఎన్.జి.ఓ లు, ఆరోగ్య వర్కర్స్ తదితరులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. గ్రామ స్థాయి సమావేశాల్లో అనాధ పిల్లల్ని, స్కూల్ డ్రాప్ ఔట్స్‌ను, గుర్తించాలన్నారు. బాల్య వివాహాలు, ట్రాఫికింగ్, డ్రగ్స్, దోపిడీ తదితర అంశాల పై చర్చించాలని అన్నారు. బాలల హక్కుల సంరక్షణపై అవగాహనా సదస్సులు నిర్వహించాలని, నైపుణ్య శిక్షణలు, కెరీర్ కౌన్సిలింగ్ తదితర కార్యక్రమాలను నిర్వహించి పునరావాసం కల్పించాలని తెలిపారు. గ్రామ స్థాయి లో నిర్వహించిన కమిటీలో చర్చించిన అంశాలను జిల్లాస్థాయి కమిటీకి పంపించాలని ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయం తో ఓని చేయవలసిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయిలో పరిష్కారం లభించని వాటికీ జిల్లా స్థాయి లో చర్చించి తగు పరిష్కారం చూపించడం జరుగుతుందని అన్నారు. జిల్లా స్థాయి లో ప్రతి నెల కమిటీ సమావేశం జరుగుతుందని, అదే విధంగా మండల స్థాయి, మున్సిపల్ స్థాయి సమావేశాలలో కూడా బాలల హక్కుల పై చర్చ జరగాలని అన్నారు. గ్రామ స్థాయిలో, టీనేజీ ప్రెగ్నెన్సీ, బాల్య వివాహాలపై చర్చ జరగాలని, బాల్య వివాహాలు చేయాలనే ఆలోచనే తల్లి దండ్రులకు రాకుండా చేయాలనీ, బాల్య వివాహాల చట్టంపై అవగాహన కలిగించి చట్టం లో ఉన్న శిక్షల పై కూడా తెలిసేలా చర్చించాలని తెలిపారు. డ్రాప్ ఔట్ అయిన బాలికలను గుర్తించి డ్రాప్ ఔట్‌కు గలా కారణాలను విశ్లేషించాలని డి.ఈ.ఓకు తెలిపారు. అలాగే కర్మాగారాల్లో, హెూటల్స్‌లో పనిచేసే బాలికలను గుర్తించాలని లేబర్ కమీషనర్ కు సూచించారు. ఈ సమావేశం లో ఐ.సి.డి.ఎస్. ఇంచార్జ్ పి.డి ప్రసన్న, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.జీవన రాణి, మున్సిపల్ కమీషనర్ నల్లనయ్య, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ సత్యనారాయణ, డి.సి.పి.ఓ లక్ష్మి, డి.ఎస్.పి., తదితరులు పాల్గొన్నారు.

రాజాం రోడ్డు విస్తరణలో పని నాణ్యత తనిఖీలు

విశాలాంధ్ర-రాజాం : స్థానికంగా జరుగుతున్న పాలకొండ రోడ్డు అభివృద్ధి పనులను ఆర్ అండ్ బి క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ బి.వెంకటేశ్వరరావు బుధవారం తనిఖీలు చేసారు. పలు చోట్ల తవ్వకాలు జరిపి, 'క్వాలిటీ'ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'మెటీరియల్‌ను ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. అక్కడ నుంచి వచ్చిన రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. ఆయనతోపాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్ళు విప్పకుండానే పసికందు కన్నుమూత

ఎస్.కోట ఏరియా ఆసుపత్రిలో ఘటన

విశాలాంధ్ర - శృంగవరపుకోట : అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీకి చెందిన శాంతి కుమారి అనే గర్భిణీ పురిటి నొప్పులు రావడంతో ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యంతో తీసుకురావడం జరిగింది. ఒక రాత్రంతా గర్భిణి శాంతి కుమారి సరైన చికిత్స అందించకుండా బుధవారం ఉదయం ప్రసూతి గదిలోకి తీసుకువెళ్లి ప్రసతి నిర్వహిస్తున్న సందర్భంలో తల్లి ప్రేగులు మెడ కు చుట్టుకొని పసికందు చనిపోయిందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. పసికందు తండ్రి మాట్లాడుతూ సరైన చికిత్స అందించకపోవడం వల్ల అప్పుడే పుట్టిన మాపాప చనిపోయిందని శిశువు తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. మాకు న్యాయం జరిగేంత వరకు మరణించిన శిశువును ఇంటికి తీసుకుపోమని కుటుంబ సభ్యులు హాస్పటల్ వద్ద బైఠాయించిన పరిస్థితి నెలకొన్నది.

పాముకాటుతో ఇంటర్ విద్యార్థిని మౌనిక మృతి

విశాలాంధ్ర - గుర్ల: మండలంలో ఫకీర్ కిట్టలి పంచాయతీ మధుర గ్రామమైన బుర్లెపేట గ్రామానికి చెందిన ద్వారపూడి మౌనిక పాము కాటుతో మృతి చెందింది. మంగళవారం రాత్రి ఇంటి వద్ద పాము కాటు వేయడంతో వెంటనే ఆమె తల్లిదండ్రులు విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. ఈమె నెల్లిమర్లలో సికేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుంది. తల్లిదండ్రులు, బంధువులు ఆ ప్రాంతమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సాయం

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని బస్టాండ్ సమీపంలో ఉన్న రంభవీదిలో రెండు రోజులక్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో పాకలను కోల్పోయిన ముగ్గురు బాధితులకు రెడ్‌క్రాస్ సహాయాన్ని అందించింది. రెడ్‌క్రాస్ మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ కంది వెంకటరమణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ముడిదాపురాము, మన్మధ రావులు ఈసహాయాన్ని బాధితులకు అందజేసారు. ఒక్కో కుటుంబానికి ఒక రగ్గు, టార్పాలిన్, స్టీల్ వంటసామాగ్రిలను స్థానిక విఆర్‌వో అరుణకుమారి, టీడీపీ నేతలు ఎల్.అప్పారావు, కొత్తలి శ్రీను, గొర్ల శ్రీను చేతుల మీదుగా బాధితులకు అందజేసారు.

మా మహామాయ కంపెనీలో క్షయ వ్యాధిపై అవగాహన

పిహెచ్‌సి డాక్టర్ అనిల్ కుమార్

విశాలాంధ్ర-లక్కవరపుకోట : మండలంలోని రెల్లి గౌరంపేట పరిధిలోగల మా మహామాయ కంపెనీలో బుధవారం లక్కవరపుకోట పి హెచ్ సి డాక్టర్ బి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమము నిర్వహించినట్లు ఆయన తెలిపారు. క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమము మా మహామాయ కంపెనీలో నిర్వహించామని తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రెండు వారాల కన్నా ఎక్కువ రోజులు జలుబు ఉన్న, బరువు తగ్గిన, జ్వరం వచ్చిన, ఆకలి ఎక్కువగా లేకపోయినా, ఆయాసం ఉన్న క్షయ ధి కావచ్చని తెలిపారు. షుగర్, బిపి, ధూమపానం, మద్యపానం అలవాటులు ఉన్నవాళ్లకు, 60 ఏళ్ళ పైబడిన వాళ్లకి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. జనసమూహాలు ఎక్కువగా ఉన్న, కర్మాగారాలలో పనిచేస్తున్న వారికి ఎక్కువగా ఈ వ్యాధి వచ్చే అవకాశాలు చాలా ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ముందుగా ఈ వ్యాధి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్య సూత్రాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, కర్మాగారం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పెసలు, మినుములు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్/జామి : జిల్లాలో రైతుల నుంచి పెసలు, మినుములు కొనుగోలు చేసే నిమిత్తం మూడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ నడిపేన వేంకటేశ్వర రావు తెలిపారు. జామి మండలం విజినిగిరి, గంట్యాడలో రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభించామని, గజపతినగరంలో పి.ఏ.సి.ఎస్.లో ఈకేంద్రాన్ని బుధవారం తెరిచినట్లు వెల్లడించారు. రైతులు తాము పండించే పెసలు, మినుములు వ్యవసాయ ఉత్పత్తులను పూర్తిగా శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందవచ్చని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాల మేరకు తమ ఉత్పత్తులు వుండేలా రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. రబీ సీజన్-2024 సంవత్సరంలో పండించే పెసలు మినుములు మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఇ-క్రాప్ చేయించుకున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను సి.ఎం - యాప్ నందు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రత్యేక కార్యాచరణతో పన్నుల వసూళ్లు

విశాలాంధ్ర-విజయనగరం : నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న ఎస్‌బిటి మార్కెట్లో నగరపాలక సంస్థ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక కార్యాచరణతో పన్ను వసూలు ప్రక్రియను చేపట్టారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఎస్‌బిటి మార్కెట్ అసోసియేషన్ బిల్డింగులో పన్ను వసూలు కై ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా ప్రచార వాహనంతో పన్నుదారులకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత జప్తు వాహనంతో సహాయ కమిషనర్ కే.అప్పలరాజు, ఇతర రెవెన్యూ సిబ్బంది ప్రతి దుకాణం వద్ద కు వెళ్లి బకాయి ఉన్న ఆస్తిపన్ను వివరాలను తెలియజేస్తూ తక్షణమే చెల్లించాలని పట్టుబట్టారు. దీంతో అనేకమంది తక్షణమే పన్నులను చెల్లించారు. కొంతమంది చెక్కుల రూపంలోనూ,ఆన్లైన్ ద్వారా పన్నులను చెల్లించారు. దీంతో గణనీయమైన ఆస్తిపన్ను వసూలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో పది రోజులు మాత్రమే ఉన్నదని కావున ప్రతి ఒక్కరు తక్షణమే బకాయి ఉన్న పన్నులను చెల్లించాలని చెప్పారు. ఈ సంవత్సరం వడ్డీ మాఫీ లేనందున వెంటనే పన్నులను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

కళలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి : అధితి గజపతిరాజు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : కళలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని బుధవారం శాసనసభ సమావేశాల్లో విజయనగరం శాసనసభ్యులు పూసపాటి విజయలక్ష్మి గజపతిరాజు కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన బొబ్బిలి వీణ తయారీకి పనసకర్ర వినియోగిస్తారని భవిష్యత్తులో పనసకర్ర కొరత ఏర్పడకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బొబ్బిలి చీరలకు మంగళగిరి చీరల వలె ప్రోత్సాహం కల్పించాలని కోరారు. విజయనగరంలో 1919 సంవత్సరంలో మహారాజా విజయరామ గజపతిరాజు ప్రారంభించిన సంగీత నృత్య కళాశాల గురించి ప్రస్తావించారు. 2019 సంవత్సరంలో కళాశాల 100 సంవత్సరాల వేడుకల సందర్భంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో పూసపాటి అశోక్ గజపతిరాజు కేంద్రమంత్రి ఉన్న సమయంలో నిధులు మంజూరు చేయడం వలన కళాశాల అభివృద్ధికి సహకారం అందించారని తెలిపారు. ఈ కళాశాలకు మొదటి ప్రధానోపాధ్యాయులుగా హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు వ్యవహరించారని గర్వంగా చెప్పుకుంటారని అన్నారు. ఇటువంటి కళలను ప్రోత్సహించి భావితరాలకు అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరడం జరిగిందన్నారు.

ఆహార భద్రత అధికారి ముమ్మర తనిఖీలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్ కోట పట్టణ కేంద్రంలో రిలయన్స్ స్మార్ట్ బజార్ యందు ముమ్మర తనిఖీలను విజయనగరం జిల్లా ఆహార భద్రత అధికారులు నిర్వహించారు నిత్యవసరాల వస్తువు అయిన పచ్చి శనగపప్పు కెమికల్స్ వాడుతూ రంగు వచ్చే విధంగా ఆకర్షణీయమైన పద్ధతిలో తయారుచేసి అమ్ముతున్నారని అభియోగంతో ఈతనిఖీ నిర్వహించినట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నాగుల్ తెలియజేశారు ఈ కార్యక్రమంలో పట్టణ వ్యాపారస్తుల సంఘ ఉపాధ్యక్షులు కొల్లా వెంకటేష్ పాల్గొన్నారు

సీతం కళాశాలలో ముగిసిన ఎంప్లాయిబిలిటీ, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సీతం ఇంజనీరింగ్ కళాశాలలో ఎంప్లాయబిలిటీ, సాఫ్ట్ స్కిల్స్ మీద వారం రోజుల పాటు చివరి సంవత్సరం విద్యార్థినిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడినది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని నాంది ఫౌండేషన్, మహీంద్రా ప్రైడ్ సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శిక్షకులుగా కే గౌతమ్ శంకర్, వై హరి కుమార్ వ్యవహించారు. వీరు విద్యార్థులకు అనేక విషయాలను బోదించారు. ఇందులో ముఖ్యంగా నీడ్ అనాలసిస్, సెల్ఫ్ అవేర్నెస్, ప్రీ అసెస్మెంట్, గోల్ సెట్టింగ్, టైం మానేజ్మెంట్, గ్రీటింగ్స్, బాడీ లాంగ్వేజ్, రెస్యూమ్ ప్రేపరషన్, గ్రూప్ డిస్కషన్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, పార్టిసిపేషన్ ఇన్ మీటింగ్స్ మరియు క్రిటికల్ థింకింగ్ విషయాలమీద అవగాహన కల్పించారు. విద్యార్థులు ఈ శిక్షణా కార్యక్రమంవల్ల తాము ఎంతో నేర్చుకున్నామని తెలియజేసారు.సీతం ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థినిలు ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం ట్రైనింగ్ అండ్ ప్లేసెమెంట్ డిపార్ట్మెంట్ పర్యవేక్షణలో నిర్వహించారు.

పాలకులు మారుతున్నా, గిరిజనుల బతుకులు మారడం లేదు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పాలకులు మారుతున్న గిరిజనుల బ్రతుకులలో మార్పులు రావడంలేదని సిపిఐ ప్రజా చైతన్య యాత్రలో శనివారం మండలంలోని కొండమల్లిపూడి, కాశీపతిరాజపురం గిరిజన గ్రామాలలో పర్యటించగా ఆ గ్రామాల గిరిజనులు వారి సమస్యలను సిపిఐ నాయకుల ముందుకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ భారతదేశానికి స్వతంత్రం వచ్చి 78 ఏళ్లు కావస్తున్నా గిరిజనుల బ్రతుకుల్లో మార్పు రాలేదని, మండలంలోని కొత్తూరు నుండి కొండమల్లిపూడి మరియు కాశీపతిరాజపురం గిరిజన గ్రామాలకు సుమారు ఐదుకిలోమీటర్ల రోడ్డు నిర్మించకపోవడంతో ఈ గ్రామాల గిరిజనులు అక్షర జ్ఞానానికి దూరమవుతున్నారని ఈ మతోన్మాద బూర్జువ పార్టీ నాయకులకు గిరిజనుల ఓట్లు కావాలి గాని ఈ ప్రాంత అభివృద్ధికీ మాత్రం ఆలోచన చేయడం లేదని నేటికీ గ్రామాలలో శాశ్వత స్మశానవాటిక లేకపోవడంతో గెడ్డ కాలువ పక్కన ఖననం చేయవలసి వస్తుందని ఈ గ్రామాలకు శాశ్వత స్మశాన వాటిక ఏర్పాటు చేసి స్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలని, అదేవిధంగా ఎక్కడ గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టాలు మంజూరు చేయాలని, బకాయి ఉన్న ఉపాధిహామీ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, రేషన్ కార్డు పై 35 కేజీలు బియ్యం ఇవ్వాలని రేషన్ కార్డులు బైఫర్ కేషన్ చేయాలని, డ్రైనేజీ కాలువలు, ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేయాలని గిరిజన రైతులు సేకరించి ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి జీ సి సి కార్పొరేషన్ ద్వారా కొనుగోలు కేంద్రాలుఏర్పాటు చేయాలని సిపిఐ పార్టీ బృందానికి ఈ గ్రామాల గిరిజనుల గోడును విన్నవించుకున్నారని ఈ సమస్యల పరిష్కారానికై ఈనెల 20వ తేదీన శృంగవరపుకోట తాసిల్దార్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాలో పాల్గొవాలని స్థానిక గిరి పుత్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విశాలాంధ్ర
పేజి : 2
విజయనగరం
గురువారం 20, మార్చి 2025

మణికంఠ పీఠం నిర్మాణానికి రూ. 30 వేలు వితరణ

విశాలాంధ్ర-పూసపాటిరేగ : నెల్లిమర్ల మండలం గొర్లేపేట గ్రామంలో స్వామి అయ్యప్ప మణికంఠ దేవుడి పీఠం నిర్మాణానికి పూసపాటి రేగ మండలం కొవ్వాడ గ్రామ సర్పంచ్ జనసేన నాయకుడు కోట్ల రఘు 30 వేల రూపాయలు విరాళంగా ఇచ్చారు.గొర్లపేట గ్రామస్తులు అతనికి ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఠం గురు స్వామి పుల్లే వెంకట లక్ష్మీనరసింహం , నడుపూరి పర్సినాయుడు,పిన్నింటి పాపునుడు,నడుపూరీ శ్రీను, తాళ్ళ పూడి అచ్చం నాయుడు,పినింటి చంద్ర రావు, పప్పల రామానాయుడు, పిన్నింటి వెంకటేష్ పాల్గొన్నారు.

బడి బస్సులు ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో అవసరమున్నచోట్ల బడి బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మయూరి జంక్షన్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు ర్యాలీ నిర్వహించడం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్ష,కార్యదర్శిలు జి.సూరిబాబు, కె.రాజు మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థులు బడి బస్సులు కోసం ఇబ్బంది పడుతున్నారని కావున, జిల్లా వ్యాప్తంగా బడి బస్సులు సంఖ్య పెంచాలన్నారు. సమయానికి బస్సులు చేరేలా చూడాలన్నారు. విజయనగరం నుంచి రణస్థలం వరకు, విజయనగరం నుంచి సతివాడ వరకు, విజయనగరం నుంచి కుమిలి వరకు బడి బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల ముందు వరకు మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , విద్యార్థులు పక్షాన మేము ఉంటాము ఏ ఇబ్బంది ఉన్నా మాతో చెప్పండి అని అన్నారని, ప్రభుత్వాలు అధికారానికి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్న కనీసం విద్యార్థులకు సమస్యలు పట్టించుకోలేదన్నారు. కాబట్టి బడి బస్సులు సమస్యని పరిష్కారం చేయలేక పోతే ప్రభుత్వంపై విద్యార్థులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహా కార్యదర్శి, శిరీష, సోమేష్, పట్టణ కమిటీ సభ్యులు శివ, గుణ, జయ, లక్ష్మి, పాల్గొన్నారు.

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో వర్క్‌షాప్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ మరియు జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ సంయుక్తంగా కెమిస్ట్రీ విభాగం మాలిక్యూల్స్ టు మెటీరియల్స్ అనే ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ అధ్యక్ష ప్రసంగం చేస్తూ, ఆవిష్కరణ, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడంలో విశ్వవిద్యాలయం ఎప్పుడు ముందు ఉంటుందని రసాయనిక శాస్త్రం ఉద్యోగ ఉపాధి అవకాశాలను ఎక్కువగా అందించే విభాగమని, ఈరోజు మెటీరియల్ సైన్స్ పైనే ప్రపంచం ఆధార పడి ఉందన్నారు రాబోయే రోజులలో ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు నానో టెక్నాలజీ లతో కలసి ప్రపంచాన్ని శాసించే విధంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నల్ ఆఫ్ కెమికల్ సైన్సెస్ చీఫ్ ఎడిటర్, బెంగళూరు లోగల ఇండియన్ ఇనిస్టిట్యూట్ కి చెందిన ప్రొఫెసర్ ఎస్.నటరాజన్, ప్రొ. బాలాజీ ఆర్. జాగీర్దార్, ప్రొ. కె ఆర్ ప్రసాద్ వంటి ప్రముఖులు అధునాతన పద్ధతులలో తయారు చేసిన వివిధ పదార్థాలపై పరిశోధనాత్మక ఉపన్యాసాలు ఇచ్చారు. కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొ. ముక్కామల శరత్‌చంద్రబాబు, కోఆర్డినేటర్లు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ పడాల కిషోర్ లతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీన్‌లు, అధ్యాపకులు విద్యార్థులు, ఇతర కళాశాలల నుండి అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీలో 6వ తరగతి ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కేజీబీవీ ప్రత్యేక అధికారిని కిరణ్మయి

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల కస్తూరిబా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో 2025-26వ విద్యా సంవత్సరంనకు గాను 6వ తరగతి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 22నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారిని కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో ప్రవేశం కొరకు ఈ నెల 22 నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. దరఖాస్తులు https://apkgbv.apcf-ss.in సైట్ ద్వారా పొందవచ్చు అన్నారు.వేపాడ కేజీబీవీలో ఆరవ తరగతికి 40 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి 40 సీట్లు కలవన్నారు.కాగా అనాథ, బడి బయట పిల్లలు, డ్రా పౌట్స్ (బడి మానేసిన పిల్లలు) పేదలు ఎస్.సి, ఎస్.టి, బీసీ, మైనారిటీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని, లేదా సంబంధిత పాఠశాలలో నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చని ఏమైనా సందేహాలు సమస్యలు ఉన్నచో 9491334174,7901098532 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

సచివాలయాల పరిధిలో వాత్సల్య కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర-విజయనగరం: నగరంలోని సచివాలయాల పరిధిలో వాత్సల్య కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యంగా మహిళలకు వాత్సల్య కార్యక్రమం యొక్క ఉద్దేశాన్ని వివరిస్తూ అవగాహన కల్పించారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఉమెన్ ప్రొటెక్షన్ పోలీస్ ఆధ్వర్యంలో ప్రతి సచివాలయ పరిధిలో వాత్సల్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రధానంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాలు అరికట్టడం, అనాథ పిల్లలను గుర్తించడం, బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం, కర్మాగారాలు, ఇతర చోట్ల బాలికలు పనిచేస్తున్నట్లు అయితే గుర్తించడం, లైంగిక వేధింపులు గురికాకుండా చూడడం వంటి అంశాలపై ఉమెన్ ప్రొటెక్షన్ పోలీసులు మహిళలకు చైతన్యం కల్పిస్తున్నారన్నారు. బాల్య వివాహాలు చేసినట్లయితే అందుకు ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులే అవుతారని తెలిపారు. పిల్లలందరినీ బడిలో చేర్పించాలని చెప్పారు .బాలిక విద్యను ప్రోత్సహించాలని అన్నారు. చిన్నపిల్లలను కూలి పనుల కోసం చేర్పించకూడదని చెప్పారు. తెలియని వయసులో లైంగిక వేధింపులకు గురైనట్లయితే నిర్భయంగా అధికారులు దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ప్రొటెక్షన్ పోలీసులతోపాటు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈనెల 28న తపాలా అదాలత్

సూపరింటిండెంట్ కే.శ్రీనివాసరావు వెల్లడి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : వినియోగదారులు వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించు నిమిత్తం ఈనెల 28న తపాలా సూపరింటెండెంట్ కార్యాలయంలో తపాల అదాలత్ నిర్వహిస్తున్నామని తపాలా సూపరిండెంట్ కే.శ్రీనివాసరావు తెలిపారు. తపాల సేవలకు సంబంధించిన ప్రత్యేక వ్యక్తిగత ఫిర్యాదులు ఈ అదాలత్ నందు చర్చించబడునన్నారు. తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేకత ఫిర్యాదులు మాత్రమే ఈఅదాలత్‌లో చర్చిస్తామన్నారు. విజయనగరం పోస్టల్ వినియోగదారులు సమస్యలను ఈనెల 27లోగా కే.శ్రీనివాస్ సూపర్డెంట్ తపాలా కార్యాలయం 535002 విజయనగరం చిరునామాకు ఈనెల 27లోగా పంపాలన్నారు ఫిర్యాదుదారులు వ్యక్తిగతంగా కూడా అదాలత్‌లో పాల్గొనవచ్చని తెలిపారు.

భీమసింగి సుగర్స్ కార్మికుల పీఎఫ్, గ్రాట్యూటీ చెల్లించండి : భీశెట్టి

రాష్ట్ర చక్కెర కమిషనర్‌కి లోక్ సత్తాపార్టీ వినతి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : విజయనగరం జిల్లా భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల, ఉద్యోగుల బకాయిలు పీఎఫ్,గ్రాట్యుటీ లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ,రాష్ట్ర సుగర్ కేన్ కమిషనర్ వి.వెంకట్రావు ని కోరారు, బుధవారం విజయవాడలో కేన్ కమిషనర్ తో సమావేశమై భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులు కమిషనర్ దృష్టి కి తీసుకు వచ్చిన తరువాత విలేకరులతో మాట్లాడుతూ 2020,21 సంవత్సరంలో భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ ని మూసివేశారని, అప్పటినుండి ఇప్పటివరకూ ఫ్యాక్టరీ పై ఆధారపడ్డ కార్మికుల, ఉద్యోగుల కుటుంబాలు ఎటువంటి ఉపాధి లేక రోడ్డున పడ్డాయని,కర్మాగారం మూతపడి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా నేటికీ వారికి రావలసిన పీఎఫ్,గ్రాట్యుటీ చెల్లించలేదని, చాలామంది ఉద్యోగులు,కార్మికులు తమ పిల్లలను చదివించుకోలేక, బ్రతకడానికి ఉపాధి లేక ఆందోళన తో చనిపోయారని భీశెట్టి ఆందోళన వ్యక్తం చేశారు,ఇప్పటికే జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తో,పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్‌తో తాను కార్మిక నాయకుల బృందం సమావేశమై కార్మికుల కుటుంబాల సమస్యలు వారి దృష్టి కి తీసుకు వచ్చామని,సుగర్ కేన్ కమిషనర్ కూడా ప్రభుత్వం దృష్టికి పిఎఫ్,గ్రాట్యుటీ అంశాన్ని తీసుకు వెళ్లి కార్మికుల ఉద్యోగులకి త్వరగా న్యాయం చేయాలని కోరామని భీశెట్టి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏటికొప్పాక, తాండవ, అనకాపల్లి, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీలపై సత్వరమే ఒక నిర్ణయం తీసుకొని చెరకు రైతులను,కార్మికులను ఉద్యోగుల ను ఆదుకునే ప్రయత్నం చేయాలని,సుగర్ ఫ్యాక్టరీ లను తిరిగి తెరిపిస్తానని చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారని భీశెట్టి గుర్తు చేశారు, సహకార చక్కెర ఫ్యాక్టరీలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పోక్సో చట్టంపై బాల బాలికలకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : ఏపీ మోడల్ స్కూల్ ఫూల్‌బాగ్‌లో బుధవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలను ఉద్దేశించి ప్రస్తుత రోజుల్లో బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని వారి పట్ల ఎవరైనా అనుచితంగా గాని అసభ్యంగా గాని ప్రవర్తించిన యెడల ముందుగా తల్లిదండ్రులకు, క్లాస్ టీచర్ కు తెలియజేయాలని సూచించారు. 2012లో ఏర్పడిన పోక్సో చట్టం గురించి వివరంగా తెలియజేశారు.బాలికల పట్ల, బాలురు పట్ల ఎవరైనా అనుచితంగా ప్రవర్తించిన ఎడల వెంటనే స్పందించి తల్లిదండ్రులకుగాని స్కూల్ టీచర్లకు గాని ఫిర్యాదు చేయాలని సూచించారు ఈ విషయంలో బాల బాలికలకు న్యాయవ్యవస్థ ఎప్పుడు అండగా ఉంటుందని ఏ సమయంలోనైనా దీనికి సంబంధించి ఫిర్యాదు చేయవచ్చని, బాలల హక్కులను కాపాడడానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. 18 సంవత్సరములలోపు ఉన్న బాలబాలికలు చదువు యందు దృష్టి నిలపాలని తెలియజేశారు. బాలబాలికలపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వారి పట్ల కఠినమైన శిక్షలు ఉంటాయని తెలియజేశారు. 18 సంవత్సరంలోపు ఉన్న విద్యార్థులకు బాల్య దశ నుంచే రాజ్యాంగం పట్ల కొన్ని సామాన్యమైన చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రుల పట్ల ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో మెలగాలని నైతిక విలువలు నేర్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి బి.అప్పలస్వామి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి పి సత్యవతి, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్. పి.పర్వీన్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రికార్డుస్థాయిలో నవదుర్గ అమ్మవారి పూజా సామగ్రి విక్రయాల వేలం

విశాలాంధ్ర-రాజాం : రాజాంలో పాతబస్టాండ్ ఏరియాలోని శ్రీనవదుర్గ ఆలయంలో పూజాసామగ్రి' విక్రయ వేలం పాట రికార్డుస్థాయిలో జరిగింది. ప్రస్తుతం దుకాణం నిర్వహిస్తున్న వ్యాపారి రాగోలు ఆనందరావు మళ్లీ వేలం పాటలో పాల్గొని విక్రయహక్కులు దక్కించుకున్నారు. అయితే, గత రెండేళ్ల క్రితం జరిగిన వేలం పాట రూ.2.97 లక్షలు కాగా, ప్రస్తుతం రూ.4.85 లక్షలకు చేరుకోవడం విశేషం. ఆలయం ఈవో శ్యామలరావు, ప్రత్యేకాధికారి, పోలిపల్లి అమ్మవారి దేవాలయం ఈవో బి.వి. మాధవరావు ల అధ్వర్యంలో జరిగిన వేలం పాటలో దాదాపుగా ఎనిమిది మంది పాల్గొన్నప్పటికీ, ముగ్గురి మధ్య తీవ్రస్థాయిలో పోటీ జరిగింది. తగ్గుతుందేమోనని భయపడినా, ఊహించనంతగా హెచ్చుకు పాట వెళ్లడం విశేషం.స్థానికంగా బస్టాండ్ మారడం, మధ్యలో ఆర్టీసి అధికారులు గోడ నిర్మించడంతో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య బాగా తగ్గింది.ఆలయం ఆదాయం ఏడాదికి సుమారుగా 5 లక్షల వరకు తగ్గడంతో, దుకాణం వేలం పాట కూడా తక్కువకు వెళ్తుందేమోనని అధికారులు కాస్త ఆందోళన చెందారు. అయితే, బుధవారం నిర్వహించిన వేలం పాట 'పోటాపోటీ' గా జరగడం విశేషమైంది. ఈ అలయానికి అత్యధికంగా అదాయం వచ్చే రోజులు భవానీ దీక్షల రోజులు, శ్రావణమాసం' గా చెప్పవచ్చు. మిగిలిన రోజుల్లో అంతంత మాత్రంగానే భక్తుల రాక ఉంటుంది. కొన్ని రోజుల్లో అయితే, రోజుకు పది కొబ్బరికాయలు అమ్మకం కావడం కూడా గొప్పగానే అనే విధంగా వ్యాపారం ఉంటుంది. పూజాసామగ్రితోపాటు దీపాల అమ్మకం కూడా కలిపి ఉండడంతో 'వేలం పాట' భారీస్థాయిలో చేరుకున్నట్లు ఈ వ్యాపారంలో అనుభవం ఉన్న ఓ వ్యాపారి చెప్తున్నారు. 'పూజాసామగ్రి' వల్ల కొస్త దెబ్బ తగిలినా, 'దీపాల' అమ్మకాల వల్ల లోటు భర్తీ అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. అందుకే, వేలం పాట పాటాపోటీగా జరిగిందన్నారు. ఏదిఏమైనా, స్థానికంగా నెలకొన్న పరిస్థితుల వల్ల ఆలయానికి ఆదాయం తగ్గిన నేపథ్యంలో, ఈ ఏడాది జరిగిన పూజాసామగ్రి విక్రయం వేలంపాట వల్ల రూ.1.80 లక్షల ఆదాయం పెరగడం విశేషం. అమ్మవారి కృపగా అందరూ పేర్కొంటూ, అమ్మవారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. వేలంపాటకు ఆలయం ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, విశ్రాంత ఉద్యోగి కూరాడ వెంకటరావు, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు ధరఖాస్తు చేసుకోండి

దాతల సహకారంతో హాస్టళ్ల మరమ్మతులు

రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ యశస్వి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : బిసి కార్పొరేషన్ రుణాలకు పెద్ద ఎత్తున ధరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన బిసి రుణాలపై జిల్లా బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ఛైర్‌పర్సన్ యశస్వి మాట్లాడుతూ, బిసిల్లో పేదలకు ఈ పథకం వరం లాంటిదని పేర్కొన్నారు. దాదాపు 145రకాల యూనిట్లకు ప్రభుత్వం సబ్సిడీని, బ్యాంకులనుంచి రుణాలను ఇప్పించడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని యూనిట్లను స్థాపించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ రుణాలపట్ల నాయకులు, కార్యకర్తలు అర్హులకు అవగాహన కల్పించి, ధరఖాస్తు చేయించాలని సూచించారు. ప్రభుత్వపరంగా మీడియా, పాంప్లేట్ల ద్వారా విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. దాతల సహకారంతో బిసి హాస్టళ్లను మరమ్మతు చేయించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా జిల్లా బిసి కార్పొరేషన్ ఈడి పెంటోజీరావు మాట్లాడుతూ, బిసి రుణాలకు ధరఖాస్తు చేసుకొనే విధానం, అర్హతలు, బిసి సంక్షేమశాఖ కార్యకలాపాలు, హాస్టళ్ల స్థితిగతులు, టైలరింగ్ శిక్షణ, ఎపి బిసి స్టడీసర్కిల్ శిక్షణా కార్యక్రమాలు తదితర అంశాలను వివరించారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన బిసిలు, ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్య, క్షత్రియ, రెడ్డి, కమ్మ, బ్రాహ్మణ, ఎసి కాపు వర్గాలు కూడా ధరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఈ నెల 22వ తేదీలోగా ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈసమావేశంలో ఏబిసిడబ్ల్యూఓలు ఎం.యశోధనరావు, బి.రాజులమ్మ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూఆప్ చార్జీలు రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు డిమాండ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ బుధవారం సిపిఎం రాష్ట్ర పిలుపులో భాగంగా స్థానిక ఫూల్‌భాగ్ కాలనీ 4వ వార్డులో విద్యుత్ బిల్లులు దహనం కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం ఎటువంటి విద్యుత్ చార్జీలు పెంచమని చెపుతూనె ట్రూఆప్ చార్జీలు, పేరుతో వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గం అన్నారు తక్షణమే ట్రూఆప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శి రామాలక్ష్మీ, సభ్యులు విజయ, గురయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు. ఎకనపాకలో విద్యుత్ బిల్లులు దహనం కార్యక్రమం జరిగింది. సిపిఎం జిల్లా కమిటీ కమిటీ సభ్యులు పి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి యోగా అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : భారత ప్రభుత్వం వారు అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్, 21) ని పురస్కరించు కొని ప్రధాన మంత్రి యోగా అవార్డులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో వ్యక్తులు, సంస్థలు యోగా ని సమాజములోకి అంకిత భావంతో ప్రజలలోకి తీసుకువెళ్లి, వారికి సేవలను అందిస్తున్న వారు ఈ అవార్డులకు అర్హులుగా నిర్ణయించి వారినుండి దరఖాస్తులను ఆహ్వానించు చున్నారు. ఈ అవార్డుకు ఎంపిక అయిన వ్యక్తులు/సంస్థలకు 25 లక్షల రూపాయలు ప్రైజ్ మనీ ఇవ్వబడునని కేంద్ర ప్రభుత్వం వారు తెలియజేసియున్నారు. 2025 సంవత్సరములో ప్రధాన మంత్రి యోగా అవార్డుకు దరఖాస్తు చేసుకొను నిమిత్తం జిల్లాలోని వ్యక్తులు/సంస్థలు వారియొక్క దరఖాస్తును నిర్దీత ప్రొఫార్మాలో నేరుగా www.mygov.in వెబ్సైట్ నందు గల https://innovateindia.mygov.in/pm-yoga-awards-2025/ లింక్ ద్వారా లేదా మినిస్ట్రీ ఆఫ్ ఆయుష్ వెబ్సైట్ ద్వారా నేరుగా దరఖాస్తులను తేది: 31.03.2025 లోగా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవలెనని ముఖ్య కార్యనిర్వహణాధికారి, ఎ. సోమేశ్వరరావు తెలిపారు.

ఆక్రమణలు తొలిగించిన రెవిన్యూ సిబ్బంది

విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండలంలో కనిమెల్ల రెవిన్యూ గ్రామం సర్వే నెంబర్ 61-50 గోర్జి ను ఆక్రమించి వాటర్ ప్లాంట్ ను భూ ఆక్రమణ చట్ట ప్రకారం రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు సదరు వాటర్ ప్లాంటను బుధవారం తొలగించారని స్థానిక తాసిల్దార్ తాడి గోవిందరావు తెలిపారు.

క్వారీలో రిగ్ బ్లాస్టింగ్ ను అడ్డుకున్న గ్రామస్తులు

వున్న క్వారీలో భారీ రిగ్గు బ్లాస్టింగ్‌లను అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : చుక్కపాలెం, ఆలుగు బిల్లి, ధర్మవరం.సన్యాసయ్య పాలెం, చామలపల్లి గ్రామాలకు ఆనుకుని ఉన్న కొండలపై పెద్ద పెద్ద రిగ్గు బ్లాస్టింగ్ లతో క్వారీ లలో పేల్చుతుండటం తో ఆయా గ్రామాలలో బిక్కు బిక్కు మని బ్రతుకుతున్నామని, ఈ పేలుళ్లకు కొండ ప్రాంతాలలో చుట్టుపక్కల ఉన్న పంట పొలాల్లో కి పేలుడురాళ్లు పడటం తో పంటలు నష్టపోతున్నామని ఎన్ని సార్లు క్వారీ యజమాణులకి , అధికారులు కు ఫిర్యాదులు చేసినా పట్టించు కోవటం లేదని, అందులో భాగంగానే ఈ రోజు భారీ వాన్ లో ఈ రిగ్గు బ్లాస్టింగ్ యొక్క పేలుడు సామగ్రి భారీగా క్వారీ వద్దకు తరలి రావటం తో గ్రామస్తులంతా ఏకమయి ఆ వాన్ కు అడ్డుగా నిలబడి క్వారీ కు రాకుండా ఆందోళన చేపట్టారు. అనంతరం సంబంధిత,అధికారులకు ఫిర్యాదు చేశారు, ఇక ఏటువంటి అనుమతి లేని రిగ్గు బ్లాస్టింగ్ లు జరుగకుండా చూడాలని అంతవరకు ఈ ఆందోళన చేపడతామని అన్నారు.

నగర అందాలను మెరుగుపరుస్తాం : మేయర్ వేంపడాపు

విశాలాంధ్ర-విజయనగరం : నగర అందాలను మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక అంబటిసత్రం జంక్షన్ వద్ద 1 లక్షా 25 వేల రూపాయలు తో ఏర్పాటు చేసిన హై మోస్ట్ విద్యుత్ దీపాన్ని ఆమె ప్రారంభించారు. నగరపాలక సంస్థ ఈఈ టీ. రాయల్ బాబు, డిఈ ప్రసాద్, స్థానికులతో కలిసి ఆమె విద్యుత్ దీపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరపాలక సంస్థ సాధారణ నిధులు 1,25,000 రూపాయలతో హైమోస్ట్ విద్యుత్ దీపాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. నగర అందాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మీసేవ కేంద్రాల పునరుద్ధరణ

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నారా లోకేష్ ఎమ్మెల్యే బేబీ నాయన చిత్రపటాలకు పాలాభిషేకం మీసేవ ఆపరేటర్లు చేశారు. 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేసిన పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారంగా మీసేవ కేంద్రాలను పునరుద్దరణ చేయాలని అసెంబ్లీలో చర్చించిన విషయంపై రాష్ట్రస్థాయి మీసేవ కేంద్రాల వ్యవస్థాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేంద్రాల ద్వారా గతంలో ఎన్నో సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు తిరగకుండా పరిష్కరించే విధంగా ఉండేదని, ఇప్పుడు కూడా పూర్వ వైభవం వచ్చినట్లు చేసి రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాలను పునరుద్దరించాలని ప్రభుత్వానికి మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేయడంపై మీసేవ కేంద్రం రాష్ట్ర, జిల్లా స్థాయి నిర్వాహకులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఐటి శాఖకు అనుసంధానం చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబర్కి శరత్ గారు, పలువురు మీసేవ ఆపరేటర్స్ మామిడి ప్రసాద్, అజయ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో నారా లోకేష్ మరియు ఎమ్మెల్యే బేబీనాయన చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

పదోతరగతి పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ పరిశీలన

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలం చింతాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పదోతరగతి పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ ఎం శ్రీను పరిశీలన చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎర్ర బ్యాడ్జీలు ధరించి ఆర్టీసీ కార్మికుల నిరసన

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఆర్టీసీ జోనల్ కమిటీ పిలుపుమేరకు జోన్ లో ఉన్న సమస్యలపై విజయనగరం ఈడి తో జరిగిన చర్చలు విఫలం కావడంతో బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ శృంగవరపుకోట డిపో కార్మికులు ఎర్ర బ్యాడ్జీలను ధరించి బుధవారం నిరసన యూనియన్ డిపో సెక్రెటరీ రాజయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.